

అమరుల త్యాగాలు మరువలేనివి

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటించారు. 18లో ▸



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం **30.0 / 12.0**

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం



పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమీ ద్‌పురా, విద్యానగర్, ఖానాపూర్ పాఠశాలల్లో మన ఊరు–మనబడి, మన బస్తీ– మన బడి కార్యక్రమం కింద పనులు పూర్తయిన పాఠశాలలను అదనపు కలెక్టర్ రిజ్వాన్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో తొలివిడతలో 237 పాఠశాలల్లో మరమ్మతులతో పాటు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీ తదితర పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తిచేసుకొని దశల వారీగా ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాను కలెక్టర్‌గా వచ్చినప్పుడు జిల్లా గురించి తెలియదని, ఇక్కడ పనిచేయడం అదృష్టంగా భావి స్తున్నానన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంతగానో సహకరించారని చెప్పుకొచ్చారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కమిషనర్ శైలజ, వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారులు నారాయణ, నర్సయ్య, ఉదయశ్రీ, స్థానిక వార్డుల కౌన్సిలర్లు ప్రకాశ్, శ్రీనివాస్, విజయ్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి'

ఆదిలాబాద్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాపై జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, బూత్ స్థాయిలో ఉన్న సమస్యలను సోషల్ మీడియా వేదికగా చర్చించాలని తెలిపారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర నాయకులు రాథోడ్ రమేశ్, సుహాసినిరెడ్డి, ఎన్నాల నగేష్, అంకత్ రమేష్, సాకటి దశరథ్, వేణుగోపాల్, జోగు రవి, దినేష్ మటోలియా, విజయ్ బోయర్ తదితరులు పాల్గొన్నారు.



మోదం..ఖేదం

- వేతనజీవులకు ఊరట
- మిగతా వర్గాలు పెదవివిరుపు
- అంకెల గారడీ అన్న విపక్షాలు
- బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట : ఎంపీ సోయం
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌పై జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన కనిపించింది. ఆదాయపన్ను అంశం ఒక్కటే ఉద్యోగ వర్గాలకు ఊరటనివ్వగా.. జిల్లాకు ఒరిగిందేమి లేదని ఇతర వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. పార్లమెంట్‌లో బుధవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడే తప్ప ప్రజలకు మేలు చేసేలా లేదని విపక్షాలు ఆరోపించాయి. అయితే రైతులు, మేకిన్ ఇండియా ద్వారా నిరుద్యోగ యువతకు ప్రాధాన్యతనిచ్చారని స్థానిక ఎంపీ సోయం బాపూరావ్ పేర్కొన్నారు.

రైతులకు ఒరిగిందేమీ లేదు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై ఎలాంటి సబ్సిడీలు కేటాయించలేదు. వ్యాపారులకు లబ్ధి చేకూర్చేలా కేటాయింపులు ఉన్నాయే తప్పా దేశానికి అన్నం పెడుతున్న రైతన్నను ఆదుకునే ప్రయత్నం కేంద్రం చేయలేదు.

– లోకారి పోశెట్టి, రైతు సంఘం నాయకుడు

ప్రజా వ్యతిరేక బడ్జెట్..



కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో సామాన్య ప్రజానికాన్ని పూర్తిగా విస్మరించింది. ధనికులకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ యంత్రాలు, వస్తువుల ధరలను తగ్గించిన కేంద్రం నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల తగ్గింపునకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ బడ్జెట్ పూర్తిగా ప్రజ్యావ్యతిరేకమైనది.

– సాజిద్ ఖాన్, డీసీసీ అధ్యక్షుడు, ఆదిలాబాద్

బలహీన వర్గాల బడ్జెట్



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు చేకూర్చుతుంది. మేక్ ఇన్ ఇండియా రంగానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. రైతుల అభివృద్ధి లక్ష్యంగా పంట రుణాల కింద రూ.20 లక్షల కోట్లు కేటాయించడం శుభపరిణామం. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారులకు అడ్డంకిగా ఉన్న అటవీ అనుమతులు మంజూరు చేశారు. కొన్ని రోడ్లకు నిధులు కేటాయించారు. సామాన్య వర్గాల సొంతింటి కల నెరవేర్చేందుకు పీఎం ఆవాస్ యోజన కింద రూ. 79వేల కోట్లు మంజూరు శుభపరిణామం.

– సోయం బాపూరావ్, ఆదిలాబాద్ ఎంపీ

ఉద్యోగులకు ఊరట..



ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయ పరిమితిని రెండున్నర లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచడం, ఐదు స్లాబ్‌లుగా కేటాయించడం ఉద్యోగులకు ఎంతో ఊరటనిచ్చింది. ఇది శుభపరిణామం. దీన్ని స్వాగతిస్తున్నాం. ఉద్యోగులతో పాటు యువత నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు కేటాయింపులు చేయడం హర్షనీయం. కేంద్ర బడ్జెట్ అన్నిరంగాలకు అనుకూలంగా ఉంది.

– నంద అశోక్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు

అంకెల గారడీ..



కేంద్ర బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు అసంతృప్తిని మిగిల్చింది. ఈ బడ్జెట్‌లో ఎలాంటి పసలేదు. అంకెలగారడీతో ప్రజలను మభ్యపెట్టారు. ఓబీసీ గణన చేయాలని దేశంలోని అన్ని రాజకీయ పక్షాలతో పాటు బీఆర్ఎస్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. కానీ దాన్ని పట్టించుకోలేదు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్ట్, రైల్వే లైన్‌కు కేటాయింపులు చేయలేదు. –జోగురామన్న, ఎమ్మెల్యే

మంచి బడ్జెట్



జాతీయ విద్యా విధానం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుంది. స్కిల్ డెవలప్‌మెంట్ పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామం. పారిశ్రామికంగానూ కేటాయింపులు చేయడం యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. మంచి బడ్జెట్

– రుమ తాయి, డిగ్రీ విద్యార్థిని, ఆదిలాబాద్

స్టాండర్డ్ డిడక్షన్ పెంచితే బాగుండేది..



ఆదాయ పరిమితిని రూ.7లక్షలకు పెంచడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చుతుంది. అయితే స్టాండర్డ్ డిడక్షన్‌ను మరింతగా పెంచితే బాగుండేది. రెండేళ్లుగా ఆదాయ పరిమితిని పెంచలేదు. ఆలస్యంగానైనా పెంచడం సంతోషం.

– కొమ్ము కృష్ణకుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

బోధనకు బ్రేక్..



డీఈవో ప్రణీతకు ఇటీవల వినతిపత్రం అందజేస్తున్న భాషా పండితులు

- పదోన్నతుల కోసం పండితుల ఆందోళన బాట
- 9,10 తరగతులకు 'నో టీచింగ్' అంటూ నిరసన
- విద్యార్థుల చదువులకు ఆటంకం

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతుల ప్రక్రియలో అవకాశం కల్పించకపోవడంతో భాషా పండితులు ఆందోళన బాట పట్టారు. సహాయ నిరాకరణకు శ్రీకారం చుట్టారు. జాబ్‌చార్ట్ ప్రకారమే తాము విధులు నిర్వహిస్తామని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 పండితులు ఇదివరకే విద్యాశాఖ అధికారులకు నోటీసులు అందజేశారు. బుధవారం నుంచి ఉన్నత తరగతులకు పాఠ్యాంశాలు బోధించడం లేదు. దీంతో 9,10 తరగతుల విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతోంది. పదిపరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ఇది ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఏళ్లుగా నిరీక్షణ..

భాషా పండితులు పదోన్నతుల కోసం 25 ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. కోర్టు కేసు కారణంగా సమస్య పరిష్కారం కావడం లేదు. మిగతా ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించి తమకు కల్పించకపోవడంతో జూనియర్లుగా మిగిలిపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు ప్రభుత్వం పలుమార్లు భాషా పండితులను, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని ఉత్తర్వులు, జీఓలు జారీ చేసినప్పటికీ ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని కోర్టుకు వెళ్లడంతో ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. తమ జాబ్‌చార్ట్ ప్రకారం 6 నుంచి 8 తరగతులకు మాత్రమే బోధించాల్సి ఉండగా, 9,10 తరగతులకు సైతం బోధన చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

చదువులకు ఆటంకం..

ఓ వైపు పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో పండితులు సహాయ నిరాకరణ చేపట్టడంతో 9,10 తరగతుల విద్యార్థుల చదువులకు ఆటంకం ఎదురవుతుంది. తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ తదితర భాషా పండితులు సహాయ నిరాకరణ చేపడుతున్నారు. మూడు రోజుల క్రితం భాషా పండితుల సంఘం నాయకులు జిల్లా విద్యా శాఖాధికారితో పాటు రాష్ట్రస్థాయిలో ప్రభుత్వానికి విన్నవించారు. సమస్య పరిష్కరించకుంటే పాఠాలు బోధించబోమని స్పష్టం చేశారు. అలాగే ఆయా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు నోటీసులు అందించారు.

జిల్లాలో..	
ఉన్నత పాఠశాలలు	105
హిందీ పండితులు	106
మరాఠీ పండితులు	3
తెలుగు పండితులు	119
ఉర్దూ పండితులు	6

జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు..



భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామని ప్రభుత్వం దశాబ్దాల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. ఈ క్రమంలో సహాయ నిరాకరణకు దిగాం. 9,10 తరగతులకు పాఠాలు బోధించబోమని నిర్ణయించాం. జాబ్‌చార్ట్ ప్రకారం 6,7,8 తరగతులను మాత్రమే బోధిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా భాషా పండితులు, పీఈటీలకు అప్‌గ్రేడ్ చేసినా 8,638 పోస్టులను భాషా పండితులతోనే భర్తీ చేయాలి.

– వివేకానంద స్వామి, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు

పాతికేళ్లుగా ఇబ్బందులు..



ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓ నం.2, 3 ప్రకారంగా భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి. పాతికేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. మాకంటే జూనియర్లకు పదోన్నతులు కల్పించడంతో నష్టపోవాల్సి వస్తోంది. కోర్టు కేసుతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి.

– శ్యాంసుందర్ రెడ్డి, తెలుగు పండిత్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

భాషా పండితులు 9,10 తరగతులకు పాఠాలు బోధించబోమని లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి

- పేదలకు సంక్షేమ ఫలాలు అందాలి
- జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌రాజ్
- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు



బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని కొత్త కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కలెక్టర్‌గా బుధవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 6.15 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లాఅధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా అభివృద్ధికి అనుసరించాల్సిన కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. 2021లో రెండు నెలల పాటు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించానని గుర్తు చేశారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకుని ఫలితాలు సాధించామని, జిల్లాలోనూ వాటిని జీరోకు తగ్గించేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. ఉదయం 10గంటలకు వచ్చి సాయంత్రం ఐదు గంటలకు వెళ్లే పాలనను తాను నమ్మనని ప్రజల సంక్షేమం, పేదలకు ప్రభుత్వ ఫలాలు అందించేలా అధి కారుల పనితీరు ఉండాలని సూచించారు. కాగా, బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మీడియాను అను మతించకపోవడం గమనార్హం. కార్యక్రమంలో జిల్లా అటవీఅధికారి రాజశేఖర్, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, సురేష్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అరవింద్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీ దరఖాస్తులు @1600

- ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా తొలి ఘట్టం ముగిసింది. ప్రభుత్వం ఇటీవల టీచర్ల బదిలీల కోసం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అర్హులైన వారు గతనెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. తప్పుల సవరణ కోసం రెండు రోజుల పాటు గడువు ఇవ్వగా అది బుధవారంతో ముగిసింది. జిల్లాలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు సంబంధించి మొత్తం 1,097 ఖాళీగా ఉన్నాయి. ప్రధానోపాధ్యాయ పోస్టులు 44 ఖాళీలు ఉండగా, 24 మంది హెచ్‌ఎంలు ఒకే పాఠశాలలో ఐదేళ్ల పాటు పనిచేయడంతో వీరికి తప్పనిసరి బదిలీ జరగనుంది. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి బదిలీల్లో మొత్తం 68పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు సంబంధించి మొత్తం 1029పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఇదివరకు 502 పోస్టులు ఖాళీగా ఉండగా, ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు జిల్లాలో 527 మంది టీచర్లు ఉన్నారు. జిల్లాలో బదిలీల కోసం 1600 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. ఈ ఫారాలను మండల విద్యాధికా రులకు సమర్పించాల్సి ఉంది. వీటిని ఎంఈవోలు ఈనెల 6లోగా డీఈవో కార్యాలయంలో అందజేస్తారు.

దేవుని భూములకు రక్షణేది?

- కబ్జాకోరల్లో 1,600 ఎకరాలు
- కౌలుకు తీసుకుని హస్తగతం
- మహారాష్ట్రలోనే 1,250 ఎకరాలు
- పర్యవేక్షణ మరిచిన దేవాదాయ శాఖ
- భూముల అన్యాక్రాంతంపై ఇటీవల 'జెడ్పీ'లో చర్చ
- సర్వేకు అధికారుల నిర్ణయం



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములే కాదు.. దేవుడి భూములకు సైతం రక్షణ లేకుండా పోతోంది. ఆలయాల అభివృద్ధి, దీపధూప నైవేద్యాల కోసం నిజాం కాలంలో దాతలు అందించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. తొలుత లీజు, కౌలు పేరిట భూములను తీసుకున్న రైతులు ఏళ్లుగా సాగులో ఉండడంతో వారే హక్కుదారులుగా మారుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కౌలుదారులే తమ పేరిట పట్టాలు చేసుకుంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 1600 ఎకరాలకు పైగా దేవుడి భూమి ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఇందులో సింహభాగం భూమి మహారాష్ట్రలో ఉండటం, జిల్లాలోని భూములకు హక్కుపత్రాలు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇటీవల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆలయాల భూముల ఆక్రమణలను సభ దృష్టికి తీసుకొచ్చారు. భూముల అన్యాక్రాంతాన్ని అంగీకరించిన అధికారులు ఇకపై అలా జరగకుండా ఉండేలా జిల్లాలోని అన్ని దేవాలయాల భూముల సర్వే చేపట్టాలని నిర్ణయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

970 ఆలయాలు.. 1600 ఎకరాలు

ఆదిలాబాద్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 970 దేవాలయాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన 1,600 ఎకరాలకు పైబడి భూములు ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. అత్యధికంగా ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంకు సంబంధించి 1,250 ఎకరాలు ఆక్రమణకు గురికాగా, బ్రాహ్మణవాడలోని శాస్త్రి మందిరం, వేంకటేశ్వర స్వామి ఆలయం, జైనథ్‌లోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి సంబంధించిన సుమారు 400 ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఇందులో గోపాల కృష్ణ మఠం, శాస్త్రి మందిరాలకు సంబంధించిన భూములు ఎక్కువగా మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పాంఢ్రకౌడ తాలుకా గోండ్సి ప్రాంతంలో ఉన్నాయి. సుమారు 1,250 ఎకరాల భూములు ఆ ప్రాంతంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. వాటిని ఎకరాకు రూపాయి చొప్పున గతంలో కౌలుకు తీసుకున్న రైతులు ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉండటం, వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమంగా వారే స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కౌలు కూడా చెల్లించడం లేదు. మిగతా ఆలయాలకు సంబంధించి జిల్లాలోని వందల ఎకరాల భూములు సైతం కబ్జా చెరల్లో చిక్కుకున్నాయి. దాతలు ఇచ్చినవి అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన వారి వారసులు వాటి వివరాలను అధికారులకు అందించినా ప్రయోజనం లేకుండా పోతుంది. సుమారు 400 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లుగా నిర్ధారించారు. అయితే వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎందుకంటే ఇందులో ఆక్రమణదారులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం, కోర్టుల్లో కేసులు నడుస్తుండటంతో వాటి స్వాధీనానికి అవకాశం లేకుండా పోయింది. వీటితో పాటు తలమడుగు మండలం నందిగామ, జైనథ్ మండలకేంద్రం, బేల మండలం కొగ్దూర్‌లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకోవాల్సిన అధికారులు ఆదిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా దేవుడి భూములకు రక్షణ లేకుండా పోతుంది.

సర్వేకు నిర్ణయం..

భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇటీవల ఆక్రమణల పర్వం ఎక్కువైంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములే కాదు కబ్జాదారులు దేవుడి భూములను సైతం వదలడం లేదు. చిన్న ఆలయానికి సంబంధించిన కొద్ది పాటి స్థలాన్ని సైతం కబ్జా చేసి తమ పేరిట పట్టాలు చేసేసుకుంటున్నారు. ఈ దందా ఇటీవల ఎక్కువైంది. దీనిపై గతనెల 28న నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నట్లుగా ప్రస్తావించారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ సైతం వారికి మద్దతు పలుకుతూ ఆలయాల భూములను సంరక్షించాలని సభలో కలెక్టర్‌ను కోరారు. పార్టీలకతీతంగా సభ్యులు మద్దతు పలకడంతో జిల్లాలోని దేవాలయాలన్నింటికి సంబంధించిన భూములపై సర్వే చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సర్వే చేపడతామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అక్కడే ప్రకటించారు. ఇది అమలు చేసినట్‌లైతే ఆక్రమణకు గురైన భూములు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండగా, మిగిలిన భూములను కాపాడుకునే అవకాశం ఏర్పడనుంది.

భూములను కాపాడేందుకే..



వక్ఫ్ భూముల వివరాలు రెవెన్యూ రికార్డులతో పాటు పట్టాలు ఉంటాయి. కానీ దేవాలయాలకు సంబంధించిన భూముల వివరాలకు ఎలాంటి రికార్డులు లేవు. దీంతోనే విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదముంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆలయాల అభివృద్ధికి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ఏ దేవాలయానికి ఎన్ని భూములు ఉన్నాయి, వాటి విస్తీర్ణం ఎంత అనే వివరాలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించాలని కోరాం. ఈ సర్వే ద్వారా భూములను గుర్తించి పట్టాల జారీ ద్వారా భవిష్యత్ తరాలకు ఆలయ భూముల వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. వాటిని పరిరక్షించుకునే అవకాశముంటుంది.

– రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్

జాయింట్ సర్వే చేపడతాం..

దేవాలయాలకు సంబంధించిన భూములను సర్వేల్యాండ్ రికార్డ్స్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ, రెవెన్యూ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో జాయింట్ సర్వే చేపడతాం. ఆయా శాఖల పరిధిలో ఉన్న రికార్డుల ఆధారంగా భూములను సర్వే చేసి హద్దులను గుర్తిస్తాం. ఆలయ కమిటీల నిర్ణయం మేరకు వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకుంటాం.

– సిక్తా పట్నాయక్, కలెక్టర్

క్లుప్తంగా

ఐటీడీఏ పీవో బదిలీ రద్దుచేయాలి


మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి బదిలీని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడ ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమంకోసం కృషి చేస్తున్న పీవోను ఎనిమిది నెలలైనా గడువకముందే బదిలీ చేయడం సరికాదన్నారు. బదిలీని ప్రభుత్వం రద్దు చేయనిపక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయికే సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయికే ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు మెస్రం గంగాదేవి, నాయకులు సలాం వరుణ్, గెడం కేశవ్, కొడప మాధవ్‌రావ్, సర్పంచ్‌లు సిడాం లక్ష్మి, ఉర్వేత సురేశ్, గెడం చందు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముథోల్: మండలంలోని భైంసా–బాసర రహదారిపై మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండల కేంద్రానికి చెందిన సంజు తన ద్విచక్ర వాహనంపై బాసర వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు ముథోల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వేధింపులు భరించలేకనే ఏసీబీని ఆశ్రయించా

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధి కల్పన అధికారుల వేధింపులు భరించలేకనే ఏసీబీని ఆశ్రయించినట్లు దుర్గం సొసైటీ చైర్మన్ దుర్గం శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధికల్పన శాఖ అధికారి కిరణ్ కుమార్ డబ్బులు అడగడమే కాకుండా మానసికంగా వేధించినట్లు తెలిపారు. తనను కించపర్చేలా ఎంప్లాయిమెంట్ అధికారి విజయలక్ష్మి, రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ తేజ ఫోన్‌ల ద్వారా వాట్సాప్ కాల్‌చేసి హేళన చేశారన్నారు. నాలుగు రోజుల్లో ఇస్తానని చెప్పి వారం రోజులు గడిచినా డబ్బులు ఇవ్వలేదని దూషించినట్లు వివరించారు.

ఒకరిపై చీటింగ్ కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చాణిక్య కాటన్ శ్రీరాం జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి 2019 డిసెంబర్ 28న మహారాష్ట్రలోని బండార జిల్లా తుంసార గ్రామానికి చెందిన బాల్‌కిషన్ ఖల్లిని తీసుకెళ్లాడు. మొత్తం రూ.4లక్షల 31వేల 505 చెల్లించాల్సి ఉండగా రూ.లక్షా 27వేల 185 చెల్లించాడు. మిగితా డబ్బులు చెల్లించక పోవడంతో యజమాని ఎర్రంవార్ కళ్యాణ్ కోర్టును ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి


రాత్రిపూట రోడ్డుపై కమ్ముకున్న పొగ

- డంప్‌యార్డులో చెత్తకు నిప్పు
- ఊరంతా కమ్ముకుంటున్న పొగ
- అనారోగ్యం బారిన ప్రజలు

బెల్లంపల్లి: డంప్‌యార్డులో చెత్తకు నిప్పంటిస్తుండగా దట్టంగా పొగ కమ్ముకుని పురప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అందరూ శ్వాస తీసుకోవడానికి సతమతమవుతున్నారు. రాత్రిపూట గంటల కొద్దీ పొగ కమ్ముకుని ఉంటుండగా వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు నిద్రలేమికి గురవుతున్నారు. పొగ నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ ఏరియా శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో కొన్నాళ్ల క్రితం డంప్‌యార్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి ప్రస్తుతం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అక్కడి నుంచి శాంతిఖని బస్తీ శివారు ప్రాంతంలో కొత్తగా డంప్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు పదెకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు కొత్తగా ప్రాతిపాదించిన డంప్‌యార్డు పనులు ప్రారంభం కాకపోవడంతో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేస్తున్నారు. అక్కడ చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోయింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన చెత్తాచెదారం గుట్టలను తలపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని చెత్తకు రాత్రి పూట నిప్పంటిస్తున్నారు. చెత్త, వ్యర్థపదార్థాలకు మంట అంటుకుని దట్టంగా పొగ కమ్ముకుని ఉంటోంది. సమీపంలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీ, మధునన్న నగర్, కాంట్రాక్టర్ బస్తీ, ఫుట్‌బాల్‌గ్రౌండ్‌బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, పాత బస్టాండ్ ఏరియా, బజారు ఏరియా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం తీవ్రంగా ఉంటోంది.

డంప్‌యార్డు ఎత్తివేయాలి



దినాం పొగ కమ్ముకుని ఉంటోంది. నిద్రపోయే యాళ్లకు ఎవరో చెత్తకు నిప్పు పెడుతున్నరు. చెత్తకు నిప్పంటుకుని పొగంతా ఇంటిలో వ్యాపిస్తుండగా విపరీతమైన దగ్గు వస్తోంది. కండ్లు మండుతన్నయ్. సరిగా నిద్ర పట్టడం లేదు. డంప్‌యార్డు జనావాసాలకు చేరువలో ఉండడంతో పొగ భరించలేక పోతున్నాం. వెంటనే చెత్తకు నిప్పు చెట్టడాన్ని ఆపేసి డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలి.

– కన్నూరి ఓదెలు, స్థానికుడు

అప్పటి ఇబ్బందులు వద్దు



డంప్‌యార్డు నిర్వహణను మున్సిపల్ అధికారులు కొన్నినెలలుగా పట్టించుకుంటలేరు. కనీస చర్యలు తీసుకోక పోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రివేళ డంప్‌యార్డు, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెత్తకు నిప్పు పెడుతుండగా వచ్చే పొగ మామూలుగా ఉండడం లేదు. దట్టంగా వ్యాపించి ఊపిరి సలపకుండా చేస్తున్నది. వృద్ధులు, పిల్లలు భరించ లేకపోతున్నారు. ఆస్తమా పేషెంట్ల పరిస్థితి దారుణం. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చూడాలి.

– చింతల బాలరాజు, స్థానికుడు

పక్షం రోజుల నుంచి..

గడిచిన పక్షం రోజులుగా చెత్తకు ఇష్టారాజ్యంగా నిప్పంటిస్తున్నారు. చీకటి పడగానే నిప్పు పెడుతుండడంతో క్రమంగా పొగ వ్యాప్తి చెందుతోంది. రాత్రి 10 గంటల నుంచి సమీప ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుని ఉంటున్నాయి. మరో వైపు పొగతో గాలి కలుషితమవుతోంది. సరిగ్గా నిద్రకు ఉపక్రమించే వేళ పొగ దట్టంగా ఇళ్లలో వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటి కిటికీలు మూసి ఉన్నా లోపలికి పొగ వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నారు. పొగ బారి నుంచి కాపాడుకునే చర్యలు కానరాక అనేకమంది దగ్గుతో బాధ పడుతున్నారు. శ్వాస తీసుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, అస్తమా వ్యాధి గ్రస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. పొగ కారణంగా గంటల కొద్దీ సమయం నిద్రపట్టకుండా గడుపుతున్నామని పలు బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని పొగ నుంచి కాపాడాలని పురప్రజలు కోరుతున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

ఇంద్రవెల్లి(ఖానాపూర్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మర్కగూడ గ్రామానికి చెందిన బాలేరావ్ విశ్వనాథ్(40) రెండేళ్లుగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన విశ్వనాథ్ జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం ఉదయం గ్రామ పొలిమేరలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై లక్ష్మణ్

ఏఎస్సై లక్ష్మణ్ బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకోసం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాంనగర్‌లో అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని రాంనగర్ కాలనీకి చెందిన మెరుగు రాజేశ్వర్ ఇంట్లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. అద్దె ఇంట్లో ఉండి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న రాజేశ్వర్ దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.8,300ల నగదు, ఇంట్లోని సామగ్రి దగ్ధమయ్యాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. దాతలు తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జైలు

దండేపల్లి(మంచిర్యాల): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి జైలుశిక్ష విధించినట్లు లక్సెట్టిపేట సీఐ బాబా తెలిపారు. మండలంలోని తానిమడుగుకు చెందిన మాలవత్ రమేశ్ నాటుసారా అమ్ముతూ పలుమార్లు పట్టుబడ్డాడు. గతంలో దండేపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా అమ్మి బైండోవర్ ఉల్లంఘించాడు. దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమానా విధించారు. చెల్లించక పోవడంతో వచ్చే మార్చి వరకు అతనికి జైలు శిక్ష విధించారు. బుధవారం నిందితుడిని జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా వరోడ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ అజీ చిన్నిను అపహరించి హత్యాయత్నం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. 2022 సెప్టెంబర్ 6న కోర్టు కేసుకు సంబంధించి ఆదిలాబాద్ కోర్టుకు హాజరయ్యారు. ఆ సమయంలో బోథ్‌కు చెందిన రాజేశ్, విశ్వనాథ్, శ్రీధర్, సంపత్‌లు ఇర్ఫాన్ అజీ చిన్నిను కోర్టు నుంచి అపహరించి హత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు కోర్టుకు తెలిపాడు. కోర్టు ఆదేశాల మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

డీజే యజమానికి రూ.లక్ష జరిమానా

భీమిని(బెల్లంపల్లి): అనుమతి లేకుండా డీజే పెట్టినందుకుగానూ సదరు యజమానికి భీమిని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గతేడాది అక్టోబర్ 6న భీమిని మండలంలోని కేస్లాపూర్‌లో దుర్గామాత నిమజ్జనంలో అనుమతి లేకుండా డీజే పెట్టడంతో పోలీసు కేసు నమోదైంది. దీంతో విచారణ అనంతరం డీజే యజమానికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తలమడుగు(బోథ్): గత నెల 30న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన బద్దం భగీరథ (42)కు 25 సంవత్సరాల క్రితం విలాస్‌రెడ్డితో వివాహమైంది. నాలుగేళ్ల క్రితం కుమారుడు మరణించాడు. అప్పటినుంచి మా నసిక పరిస్థితి సరిగా ఉండడంలేదు. గతనెల 30న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవళిక తెలిపారు.

మహిళను వేధించిన ఇద్దరికి జైలుశిక్ష

ఆదిలాబాద్‌టౌన్: మహిళను వేధించిన కేసులో ఇద్దరికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ జిల్లా ప్రథమశ్రేణి జడ్జి యశ్వంత్ సింగ్ చౌహాన్ తీర్పు నిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. బేల మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన మహిళను వేధించడంతో పాటు దాడికి దిగిన అదే గ్రామానికి చెందిన ఏ–1 ఆత్రం ఇస్తారికి ఏడాది జైలుతో పాటు రూ.3,500 జరిమానా, ఏ–2 ఆత్రం మణికంఠకు మూడు నెలల జైలుతో పాటు రూ.500 జరిమానా విధించారు. పీపీ నవీన్ కుమార్ ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పు నిచ్చినట్లు ఆయన వివరించారు.

గుడుంబా స్థావరంపై దాడులు

సారంగపూర్(నిర్మల్): మండలంలోని కుప్టితండాలో బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్ ఇంట్లో సోదా చేయగా ఐదు లీటర్ల గుడుంబా, వంద లీటర్ల బెల్లం పానకం, ప్లాస్టిక్ డబ్బాలు లభ్యమయ్యాయి. నిందితుడు అరవింద్‌ను తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసి బెల్లం పానకం, గుడుంబాను ధ్వంసం చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎక్కడైనా గుడుంబా తయారు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రకాశ్, రవీందర్, వెంకటేశ్, ముత్యం, రాజశేఖర్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఖిరిడి గ్రామానికి చెందిన వడ్లూరి చంద్రమ్మ (58), రామయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా భర్త, ముగ్గురు కుమారులు మద్యానికి బానిసయ్యారు. ఇంటిని పట్టించుకోకుండా పనికి వెళ్లగా వచ్చిన డబ్బులన్నీ తాగడానికే ఖర్చు పెడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రమ్మ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

‘అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలి’

కాగజ్‌నగర్‌టౌన్: తమ కుమారుడి అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని పాలిటెక్నిక్ విద్యార్థి కొమ్ము దీక్షిత్ తల్లిదండ్రులు చక్రవర్తి, భాగ్యలక్ష్మి దంపతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం విలేకరులతో తమ గోడు వెల్లబోసుకున్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తమ కుమారుడు 2022 ఫిబ్రవరి 19న ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఫిబ్రవరి 20న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీస్టేషన్ పరిధిలో గోదావరి నదిలో ఓ గుర్తుతెలియని యువకుడి శవం లభ్యంకావడంతో పోలీసుల సమాచారం మేరకు అక్టోబర్ 18న వాటిని పరిశీలించగా చొక్కా కాదని, ప్యాంటు మాత్రం తమ కుమారుడిదేనంటూ పోలీసులకు వివరించారు. అక్టోబర్‌న వ్యక్తి తాలుకూ వెంట్రుకలు, ఎముకలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. దానికి సంబంధించిన నివేదిక ఇప్పటివరకు రాలేదన్నారు. తమ కుమారుడికి మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ఉందని, ఆమె బంధువులే కొట్టి హత్య చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని దంపతులు కోరుతున్నారు.

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి

పాతమంచిర్యాల: విద్యుత్ వినియోగ దారులపై విధిస్తున్న అదనపు చార్జీ(ఏసీడీ)లను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలపై విద్యుత్ సంస్థలు నష్టాల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చాంద్‌పాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, ఆలిండియా కిసాన్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకుడు తోకల తిరుపతి, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు జ్యోతి, అరుణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ జిల్లా కార్యదర్శి మల్లన్న, పీవైఎల్ నాయకులు సాజిద్ పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అమర వీరుల స్తూపం వద్ద బుధవారం పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటించారు. అనంతరం గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందిన 25 మంది పోలీసు అధికారులను సన్మానించారు. సన్మానం పొందిన వారిలో రిటైర్డ్ ఎస్పీలు శిథర్ రాజు, రాంచందర్, సుకుమార్ రెడ్డి, అదనపు ఎస్పీలు రాంరెడ్డి, గోద్రు, సీతారాములు, విశేష్‌కుమార్, ఎస్పీలు ఆర్.మధుమోహన్ రెడ్డి, సాయిలు, పద్మనాభరెడ్డి, డీఎస్పీలు డి.మొగిలి, ఎస్.బాలరాజు, శివప్రసాద్, డేవిడ్, ఉదయ్‌కిరణ్, విజయ్‌కుమార్, మల్లయ్య, ఏసీపీ రాధాకృష్ణ, సీఐలు జాన్ దివాకర్, సీహెచ్ భీమన్న, లచ్చన్న, ఏలియా, ఎంఏ కరీం, పురుషోత్తం, ఏఓ గంగాధర్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, బి.రాములు నాయక్, సి.సమయ్‌జాన్‌రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, సీఐలు కె.పురుషోత్తం, కె.సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, ఎం.శ్రీపాల్, ఎస్సైలు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన అధికారులతో ఎస్పీ

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

నిర్మల్‌టౌన్: కిడ్నాప్ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అబ్దుల్ అన్వర్ అనే వ్యక్తి 2019లో దుబాయ్‌కి వెళ్లి వచ్చి నిజామాబాద్‌లో స్థిరపడ్డాడు. తనవద్ద బంగారం ఉందని, మార్కెట్ ధరకంటే తక్కువకే అమ్ముతానని నిజామాబాద్ జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మహమ్మద్ నబీ, మహమ్మద్ అలీమ్, అబ్దుల్ గఫార్, ఖాజా షఫీ, అబ్దుల్ షౌకత్, విక్రాంత్, బచ్చు గంగసాగర్, నజీర్, ఖలీల్, సమీ లను నమ్మించాడు. వారి వద్ద ఉన్న సుమారు రూ.10 కోట్ల నగదు అన్వర్ అప్పగించడంతో వారికి కొద్దిమొత్తంలో బంగారం ఇచ్చి, మిగతాది ఇవ్వకుండా ఆర్నెళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. కొద్దిరోజుల క్రితం కుటుంబంతో సహా వచ్చి నిర్మల్‌లోని గాయత్రినగర్‌లో ఉంటున్న తమ బంధువైన లతీఫా ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న బాధితులు జనవరి 29న రాత్రి అన్వర్, అతని భార్య రేష్మ, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేశారు. నిజామాబాద్ జిల్లా మద్నూర్‌లోని మహమ్మద్ గౌస్‌కు చెందిన రైస్‌మిల్‌లో ఉంచారు. విచక్షణ రహితంగా కర్రలతో కాళ్లు, చేతులపై కొట్టారు. లతీఫా ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వెతుకుతున్నారని తెలుసుకున్న నిందితులు అన్వర్ కుటుంబాన్ని జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ చౌరస్తా వద్ద వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అన్వర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో మహారాష్ట్రకు వెళ్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్(ఖానాపూర్): మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో మత్స్యకారులకు వలలు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది వేల మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు 290 చెరువులకు గానూ ఇప్పటి వరకు 113 చెరువులకు సొసైటీలు ఏర్పాటు చేసి 3,279 మంది మత్స్యకారులకు చేపల వేటలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మత్స్య శాఖ ద్వారా వలలు, ద్విచక్రవాహనాలు, ఐస్‌బాక్స్‌లు అందించామన్నారు. పెసా జిల్లా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, ఏపీవో జనరల్ భీం రావ్, మత్స్యకారులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు వలలు అందజేస్తున్న పీవో

రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతి

తానూరు/ముథోల్ : ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చక్రంలో చీర కొంగు చుట్టుకుని ఆశ కార్యకర్త మృతి చెందిన సంఘటన తానూరు మండలంలోని ఖర్బాలా గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖర్బాలా గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త గాడెకర్ ఉజ్వల (38) జౌలా(బి) సబ్‌సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తోంది. బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరింది. సమయానికి బస్సులు, ఆటోలు రాకపోవడంతో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లిఫ్ట్ అడిగి ఎక్కింది. ఖర్బాలా–జౌలా(బి) గ్రామాల మధ్యకు వెళ్లగానే చీర కొంగు ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో చిక్కుకోవడంతో కింద పడిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు ముథోల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త అశోక్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.


ఉజ్వల మృతదేహం

ఆస్పత్రి ఎదుట ఆందోళన

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆశ కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. 15 రోజుల్లో రూ.2 లక్షలు ఇస్తామని సీహెచ్‌వో అబ్బాస్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సత్తన్న ఇంటికి ‘కోమటిరెడ్డి’

- పరామర్శించిన రాజ్‌గోపాల్‌రెడ్డి
- రాజకీయమేమీ లేదన్న సత్యనారాయణగౌడ్

నిర్మల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ మాజీచైర్మన్ శోభారాణి, బీఆర్ఎస్ రాష్ట్రనేత సత్యనారాయణగౌడ్ దంపతులను మునుగోడు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి కలిశారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సత్తన్న ఇంటికి వెళ్లి ఇటీవల కిడ్నీలో రాళ్లకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్న సత్యనారాయణగౌడ్‌ను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ ముథోల్ నియోజకవర్గ నేత రామారావుపటేల్, తదితరులు ఉన్నారు.

రాజకీయమేమీ లేదు..

ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేసిన నేతగా గుర్తింపు ఉన్న సత్యనారాయణగౌడ్ ఇంటికి రాజ్‌గోపాల్‌రెడ్డి రావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్ఎస్‌తో అంటీముట్టనట్లుగా ఉంటున్న సత్తన్న బీజేపీలో చేరుతారా..? ఆదిలాబాద్ పార్లమెంట్‌ను దత్తత తీసుకుంటానని పలుమార్లు ప్రకటించిన కోమటిరెడ్డి అదే విషయంలో ఈయన ఇంటికి వచ్చారా..? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. వీటిపై ‘సాక్షి’వివరణ కోరగా సత్యనారాయణగౌడ్ కొట్టిపారేశారు. రాజ్‌గోపాల్‌రెడ్డి బంధువు తనకు క్లాస్‌మేట్ అని, ఆక్రమంలో ముందునుంచీ తమకు కొంత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఆదిలాబాద్ మీటింగ్‌కు వెళ్లి వస్తూ ఆరోగ్య సమాచారం దృష్ట్యా తనను పరామర్శించడానికి మాత్రమే ఆయన వచ్చారని వివరించారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని, పార్టీల చర్చే తమ మధ్య రాలేదన్నారు. తొలిసారి తన ఇంటికి వచ్చినందున శాలువా, జ్ఞాపికతో సత్కరించానని అన్నారు.


రాజగోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి అసుదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): అండర్ ట్రయల్ ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసుదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి కోర్టులు, జైళ్ల చుట్టూ తిరిగి సమయాన్ని, భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దన్నారు. జైల్‌లో క్రమశిక్షణతో పాటు పరిశుభ్రతను పాటించాలని, భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాది తాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి అసుదుల్లా షరీఫ్